# తూర్పురాయి

భూషణాన్ని మొదటిసారిగా మా హెడ్‌మాస్టర్ గదిలో చూశాను. అప్పటికి నేను ఆ హైస్కూలుకు సైన్స్ అసిస్టెంట్‌గా బదిలీ అయివచ్చి రెండు వారాలు దాటి ఉంటాయి.

అతను ఆ గదిలోకి వచ్చిన సమయంలో నేను హెడ్‌మాస్టర్ ఎదుటి సీట్లో చూర్చుని ఉన్నాను. మా హెచ్.ఎం. స్కూల్ డిసిప్లిన్ గురించి నాతో చెబుతున్నాడు. దాని గురించి చెప్పడం ఆ కొద్ది రోజుల్లో అది అయిదోసారో, ఆరోసారో! అవతల క్లాసు ఉంది. నన్ను వెళ్ళనీయడం లేదు.

భూషణం విసురుగా గదిలోకి వస్తోంటే బంట్రోతు అతన్ని రానీయకుండా అడ్డుకోడానికి ప్రయత్నం చేయబోయేసరికి ఒక్క నెట్టు నెట్టాడు. ఆ నెట్టుకు బంట్రోతు గోడకు ఆతుక్కుని నిలబడ్డాడు. హెచ్.ఎం. ఎవరినిబడితే వాళ్ళని తన గదిలోకి రావడానికి అనుమతి ఇవ్వడు. ఇరవయి సంవత్సరాల నుండి ఆ ఊళ్ళోనే పాతుకుపోయిన వ్యక్తి. ఆ ఊరు అతనిది కాదు. అయిదు ఎకరాల మాగాణి కొనుక్కున్నాడు. మంచి ఇల్లు కట్టుకున్నాడు. భూషణం వంక చూశాను. ఆరడుగుల పొడవు ఉంటాడు. పొడుగుకు తగ్గ బలంగా లేడు. చామనచాయ మీద కొంచెం రంగులో ఉన్నాడు.

అతన్ని చూడగానే హెచ్.ఎం. ముఖంలో కవళికలు మారాయి. అతన్ని కూర్చోమనలేదు. అయినా అతను నా పక్కనే ఉన్న కుర్చీ లాక్కుని కూర్చుని చేతులు బల్లమీద పెట్టి, "చూడు పెద్ద పంతులూ! నేను ఎవరినో, ఎలాంటివాడినో నీకు తెలుసుకదా?" కోపంగా అడిగాడు.

హెచ్.ఎం. తెలుసన్నట్టు తలూపాడు.

"కనబడినోడికల్లా నీతులు చెప్పినోడివి చెప్పినట్టే ఉంటావు. చస్తే ఆచరించవు. నీతులు ఎదుటోడికేనా? నీక్కాదా? బుద్ధీ, జ్ఞానం ఉండాలయ్యా..." అంటున్నాడు.

అతను దేనిగురించి మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

"ఏయ్, మర్యాదగా మాట్లాడు" అన్నాడు హెచ్.ఎం. అతని గొంతు కొత్తగా ధ్వనించింది.

"నీకు మర్యాదేమిటయ్యా? పాఠశాల విద్యాకమిటీలో ఎన్ని తడవలు లేవనెత్తలేదు? స్కూలుకు వస్తున్న ఫండ్స్ ఎలా మయమవుతున్నాయో, పుస్తకాలు ఎక్కడికి పోతున్నాయో, ఏ పేపరు వాళ్ళకో, టీవీల వాళ్ళకో చెపితేనే నీ గోరోజనం అణగదు. చిటికెల మీద తెప్పిస్తాను. నీ స్కూలు గదులు ఊడవడానికి, దొడ్లు కడగడానికి మా పిల్లలే దొరికారా? ఏం, మీ కులపోళ్ళచేత ఆ పనులు చేయించవు? మా వాళ్ళంత తేరగా కనిపిస్తున్నారా? మళ్ళీ ఈ పనులు పిల్లలతో చేయించావో తాట తీస్తాను. జాగ్రత్త". కుడిచేయి చూపుడు వేలిని ఆడిస్తూ పళ్ళు పటపటలాడిస్తూ లేచి వెళ్ళిపోయాడు.

తుపాను హఠాత్తుగా వచ్చి వెళ్ళిపోయినట్టుగా అనిపించింది. గదిలో గాలి కదలడం ఆగిపోయింది. నిశ్శబ్దం నిలబడిపోయింది. తలుపు పక్కగా, కిటికీల్లోంచి

స్కూలు పిల్లలు పెదాలు విప్పకుండా చూస్తున్నారు. భూషణం అరుపులు వినే ఉంటారు. సాయంత్రానికల్లా ఊళ్ళో చాలామందికి తెలిసిపోతుంది. బంట్రోతు అందరినీ తరుముతోంటే నిశ్శబ్దం కదలడం మొదలెట్టింది. హెచ్.ఎం. తెల్లటి తువ్వాలుతో ముఖం తుడుచుకుంటున్నా చెమట పడుతోంది. నేను అక్కడ ఉండాలో, క్లాసుకు వెళ్ళిపోవాలో అర్థం కావడంలేదు. బంట్రోతు గదిలోంచి ఎప్పుడు జారుకున్నాడో గమనించలేదు.

బల్లమీదున్న గ్లాసులో నీళ్ళు తాగి ఖాళీ గ్లాసు బల్లమీద పెడుతూ, "వాడలా మాట్లాడుతుంటే నేనూ తిరిగి ఏదయినా అనుండేవాడిని... పొరపాటున మాట జారానా... అంతే... అట్రాసిటీ కేసు పెట్టినా పెట్టగలడు. లోగడ అన్నల్లో తిరిగాడు. ఇప్పటికీ వాళ్ళతో సంబంధాల ఉన్నాయని వాళ్ళూ వీళ్ళూ అనుకుంటూ ఉంటుంటారు. అంచాత వీడితో ఎవరూ పోట్లాటకు దిగరు. మాట్లాడటానికే భయపడుతుంటారు" అన్నాడు.

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలంటే ఆ సంఘటన వలన మంచే జరిగింది. తర్వాత ఎప్పుడూ పిల్లలచేత గదులు ఊడ్పించలేదు. దొడ్లు కడిగించడం మానేశాడు. బడికి వచ్చే ఫండ్స్ తనకోసం వాడుకోవడం మానేశాడో లేదో తెలియదు. పుస్తకాల పంపిణీ సక్రమం అయింది. లోగడ అతను చేసిన అవకతవకల వలన కొద్దో గొప్పో వెనక వేసుకున్నాడని విన్నాను. సంపాదించింది ఏం చేసుకుంటాడో తెలియదు. అతనికి పిల్లలు లేరు.

భూషణాన్ని రెండోసారి ఊరి బస్టాండు దగ్గరున్న అతని చెప్పుల దుకాణంలో చూశాను. ఆ లిడ్‌కేప్ వాళ్ళ దుకాణం పాతబడి పక్కకు ఒరిగి ఉంది. దుకాణం ఏమంత పెద్దది కాదు. రోడ్డు పక్కనే ఉన్న చెట్టు కింద ఉంది. అతను నన్ను చూసి గుర్తుపట్టాడు. ఆప్యాయతతో నవ్వుతూ తలకు చుట్టుకున్న ఎర్ర తువ్వాలు తీసి దుకాణానికి అనుకుని ఉన్న స్టూలు తుడిచి, "కూర్చోండి" అన్నాడు.

కూర్చున్నాను. ఆ ఊరు పట్టణం కాదు. పెద్ద గ్రామం. అక్కడికి దగ్గరలోనే పట్టణం ఉంది. "ఊరెళ్తున్నారా?" అడిగాడు. చెట్టునీడ చల్లగా ఉంది.

"లేదు. ఉత్తరం పోస్ట్ చేద్దామని వచ్చాను" అన్నాను. బస్టాండుకు అవతల పోస్టాఫీసు ఉంది.

నేను వద్దంటున్నా రోడ్డుకు అవతల ఉన్న టీ కొట్టు వాడిని కేకవేసి రెండు

స్పెషల్ టీలు పట్టుకురమ్మని చెప్పాడు. అట్టే ఆలస్యం చేయకుండా టీ వచ్చింది. చెరొక గ్లాసు తీసుకున్నాం.

"రెండు మూడేళ్ళ కిందటి వరకు ఈ ఊళ్ళో రెండు గ్లాసుల పద్ధతి ఉండేది. ఇప్పుడు పూర్తిగా పోయిందని కాదు. తగ్గింది... మా అబ్బాయి ప్రకాశం చదువు ఎలా ఉందండీ?" అడిగాడు.

"వాడికేం? బాగా చదువుతున్నాడు. మంచి మార్కులే తెచ్చుకుంటున్నాడు. కొంత సానబెడితే వాడికి తిరుగుండదు. నీకెంత కష్టమొచ్చినా వాడి చదువు ఆపకు".

"ఆపనండీ. మీరు మా వాడికి ఎంతో సహాయం చేస్తున్నట్టు చెప్పాడండీ. మిమ్మల్నే నమ్ముకున్నాడండీ."

మా నాన్న కూలిపని చేసి నన్ను చదివించి టీచర్‌గా చేయగలిగాడు. లేకుంటే ఆయసలా నేనూ జూట్‌మిల్లులో కూలి పనులు చేస్తుండేవాడిని. దీనికంటే మంచి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేశాను. కాని అదృష్టానికి దగ్గర కాలేకపోయాను. ఎక్కడకు వెళ్ళినా లంచంతో పని. ఒక సమయంలో విసుగేసి అన్నల్లో చేరిపోదామనుకున్నాను. అంతలో పెళ్ళి అవడం వలన ఆ ఆలోచన తుడిచేసుకున్నాను.

"అన్నల్లోంచి ఎందుకు బయటకు వచ్చావు?" అడిగాను.

"ఇమడలేకపోయాను. మా వాళ్ళమీద జరుగుతున్న అన్యాయాలు చూసి కడుపు మండిపోయేది. పోలీసులకు చెప్పుకున్నా వినేవాళ్ళు కాదు. పైపెచ్చు మా మీదే కేసులు పెట్టి సతాయించేవాళ్ళు. రక్తం ఉడుకుతుంటే ఏదేదో చేయాలనిపించి అది అన్నల సహాయం వలనే వీలవుతుందని అన్నల్లో చేరాను. తీరా చేరాక ఎందుకు చేరానా అని బాధపడడం మొదలయింది. అక్కడా కులవివక్షత ఉంది. చేరిన కొత్తలో డ్రిల్లు నేర్పారు. తర్వాత తుపాకి ఎలా ఉపయోగించాలో, టార్గెట్‌ను ఎలా ముట్టుబెట్టాలో ఇలాంటివన్నీ చెప్పి క్లాసులు తీసుకుని మెల్లిగా నన్ను చెప్పులు, బూట్లు కుట్టడానికి, బాగుచేయడానికి ఉపయోగించడం మొదలెట్టారు. చేయనంటే తుపాకి మడమలతో డొక్కల్లో పొడిచేవాళ్ళు. మంగలివాళ్ళతో మంగలిపని చేయించేవాళ్ళు.

"రోజుల తరబడి స్నానం చేయడం కుదిరేది కాదు. అడవుల్లో ఒక చోట నుండి మరొకచోటుకు తరుచు మారాల్సి వస్తుండేది. ఎక్కడున్నామో తెలిసేది కాదు. నా భార్య చనిపోయిన సంగతి చెప్పారు కాని ఇంటికి వెళ్ళడానికి నాకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు చేరానా అన్న బాధ ఎక్కువ అవడం మొదలయింది. రాత్రులు

నిద్రపట్టేది కాదు. పారిపోబోయి దొరికిపోతే అక్కడే తూటాలకు బలి అయిపోతాను. తప్పించుకుని ఇంటికి వచ్చినా అదే గతి. పొడిదగ్గు మొదలయి ముదిరి క్షయ వ్యాధి మొదలయ్యాక నన్ను వదిలేశారు.

"ఇంటికొచ్చాక పోలీసుల బారిన పడ్డాను. రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వరండాలో కూర్చోమనేవారు. ప్రశ్నలేం అడిగేవారు కాదు. సాయంత్రం ఇంటికి వెళ్ళిపొమ్మనేవాళ్ళు. ఖళ్ళుఖళ్ళున దగ్గుతూ చుట్టూ ఉమ్ముతుంటే నన్నే కడగమనేవాళ్ళు. వినేవాడిని కాదు. మొండికేసేవాడిని. కొట్టడానికి లాఠీ ఎత్తినప్పుడు లాఠీ గట్టిగా పట్టుకుని వాడి మొఖాన్నే దగ్గేవాడిని. అక్కడ నాకు కలిసివచ్చినదేమిటంటే మా ఇంటిపేరు కొండపల్లి. నేను సీతారామయ్య తాలూకు మనిషనుకున్నారో, ఏమో వదిలేశారు. నన్ను స్టేషన్‌కు పిలవటం మానేశారు.

"తర్వాత నెమ్మదిగా నా జబ్బు నయమయింది. నా కులవృత్తి చేపట్టాను. కొన్నిసార్లు రోజుకు రెండొందల వరకూ వస్తాయి. మామూలుగా అయితే వందొస్తుంటాయి. ఉండడానికి ఇల్లు ఉంది. నాకెటూ చదువు అబ్బలేదు. ఎంత కష్టపడయినా మా వాడికి మంచి చదువు చెప్పించాలని ఉంది. వృత్తి ఇదయినా సర్టిఫికెట్ ఏమీ లేదు. ముద్ర మటుకు మిగిలిపోయింది" ఆగాడు.

అతని చేతిమీద చేయివేసి, "నువ్వేం దిగులు పెట్టుకోకు. మీ వాడు తప్పకుండా పైకొస్తాడు" అంటోంటే అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చదువులో ప్రకాశం భుజం తట్టి ఎప్పటికప్పుడు అతన్ని ఆదుకోవడం తప్ప నేను చేసిందేమీ లేదు. అతనితోపాటు మెరికల్లాంటి విద్యార్థులనందరినీ ఆదుకున్నాను. ప్రకాశం ఆర్థికంగా నన్ను సహాయం అడగలేదు. ఆటలమీద అంతగా ఆసక్తి చూపించేవాడు కాదు గాని పుస్తకాల పురుగు అయిపోయాడు. ఏమాత్రం తీరిక చిక్కినా జిల్లా గ్రంథాలయంలో కూర్చుని పుస్తకాలు చదవడంలో మునిగిపోయేవాడు. నా తోటి అధ్యాపకులు అసూయతో, వివక్షతో అతన్ని ఎక్కడికక్కడ నొక్కిపెట్టాలని చూసినా రెండింతలు తన ప్రతిభ చూపించుకునేవాడు. అతను చదివి తెలుసుకున్న విషయాలు నాకు కొత్తగా అనిపిస్తుండేవి.

అతను వెనక్కి తిరిగి చూడలేదు. ఎస్.ఎస్.సి.లో రాష్ట్రంలో మొదటివాడుగా వచ్చేసరికి మా స్కూలుపేరు మార్మోగింది. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ కాలేజి అతన్ని దత్తత తీసుకుంది. హైదరాబాద్ వెళ్ళే ముందు మా ఇంటికి నా ఆశీస్సులకు వచ్చి నా కాళ్ళకు నమస్కరించబోతోంటే వారించి పెట్టనీయలేదు. పాదాభివందనాలకు

నేను వ్యతిరేకిని. అతన్ని దగ్గరకు తీసుకుని కౌగిలించుకుంటోంటే తను కన్నీళ్ళు ఆపుకోలేకపోయాడు.

ఇంటర్‌లో కూడా స్టేట్ ఫస్ట్ వచ్చి, ఎంసెట్‌లో టాపర్ అయినప్పుడు నా సంతోషం కట్టలు తెంచుకుంది. మా స్కూలు పిల్లలందరకూ మిఠాయిలు పంచిపెట్టి, పిల్లలందరూ ఎగురుతూ గంతులు వేస్తోంటే నేనూ పిల్లాడినయి ఎగిరి గంతులు వేశాను. ఆరోజు జరిగిన టీవీ ఇంటర్వ్యూల్లో తన విజయానికి కారణం నా పేరు చెబుతోంటే నా కాళ్ళు నేలమీద ఆనలేదు. ఆ మొక్కకు అప్పుడప్పుడు నీళ్ళు పోయడం తప్ప నేను చేసిందేమీ లేదు. ప్రకాశాన్ని ఎంకరేజి చేసినట్టు మరికొంతమంది విద్యార్థులను ఎంకరేజి చేశాను. రాళ్ళ మీద పడిన విత్తనాల్లా అందులో కొంతమంది మిగిలిపోయారు. అంతెందుకు, మా పిల్లలను సరైన మార్గంలో పెట్టుకోలేకపోయాను.

మెడిసన్‌లో చేరాక ప్రకాశం మెసేజి పంపాడు. మా ఊరి రూపురేఖలు ఈమధ్యలో బాగా మారిపోయాయి. పెద్దదయింది. కార్పొరేట్ కల్చర్ వచ్చింది. పోటీలుగా కార్పొరేట్ స్కూళ్ళు, కాలేజీలు వెలిశాయి. మా స్కూల్లో విద్యార్థుల సంఖ్య మూడొంతులు పైగా పడిపోయింది. మరో రెండు సంవత్సరాలు గడిస్తే మా స్కూలు మూసేస్తారేమో అనిపిస్తోంది.

మెడిసిన్ పూర్తిచేశాక ప్రకాశం మెసేజ్ పంపించాడు. “సార్ ఇందులోనూ టాపర్‌నయ్యాను. ఇది మీరు నాకు పెట్టిన భిక్ష. మీకెంతో ఋణపడి ఉన్నానో చెప్పడానికి మాటలు చాలవు. వచ్చే నెల ఏడో తేదీన కాన్వొకేషన్ ఉంది. మీకూ, అమ్మగారికి రానూపోను ఎ.సి. టికెట్లు కొరియర్‌లో పంపించాను. నాకు తల్లిలేదు. నాన్న మూడు సంవత్సరాల కిందట చనిపోయిన సంగతి మీకూ తెలుసు. నేను పట్టా అందుకోవడం తల్లిదండ్రులుగా మీరు చూడాలి. మీరే నా సర్వస్వం” అని ఉంది. నాకు దుఃఖం ఆగలేదు. ఏడ్చేశాను.

ఆ మెసేజ్ చూసి, “ఆ మాదిగ వాడికి మనం తల్లిదండ్రులమేమిటండీ?” అంది నా భార్య రుసరుసలాడుతూ.

ఎంతోమందిలో మార్పు తీసుకువచ్చిన నేను నా భార్యను మార్చలేకపోయాను. నేను ఒక్కడినే కాన్వొకేషన్‌కు వెళ్ళాను.

*–‘స్నేహ’ (ప్రజాశక్తి ఆదివారం అనుబంధం), 25 మే, 2014*